# అనుబంధపు పాఠాలు

## పరిశుద్ధాత్మను క్రొత్తనిబంధన ఎలా సూచించింది?

పరిశుద్ధాత్మను గూర్చి బైబిలు బోధను అర్థం చేసికోవాలంటే పరిశుద్ధాత్మకు వర్తింప జేసిన ఆయా పదాలను మనం గ్రహించవలసియుంటుంది. క్రొత్త నిబంధనలో ఈ విధాలుగా ఆయన సూచింపబడ్డారు.

**ఆత్మ**

లూకా యిలా రాశాడు: "యేసు పరిశుద్ధాత్మ పూర్ణుడై యొర్దానునదినుండి తిరిగి వచ్చి, నలువది దినములు **ఆత్మ**చేత అరణ్యములో నడిపింపబడి ..." (లూకా 4:1). ఆయనను నడిపించిన ఆత్మ పరిశుద్ధాత్మ అనే సంగతి విదితమే.

పరిశుద్ధాత్మకు సంబంధించిన దూషణను సూచించినప్పుడు, మార్కు 3:29 "పరిశుద్ధాత్మ" అని ప్రయోగిస్తే, మత్తయి 12:31 "ఆత్మ" అని తెలిపింది. (పాత నిబంధనలో "ఆత్మ" – అనేకసార్లు పరిశుద్ధాత్మను సూచించడానికి వినియోగింపబడింది – ఉదాహరణకు, సంఖ్యా. 11:17, 25–29; 27:18.)

**తండ్రియొక్క ఆత్మ**

మత్తయి 10:20 "మీ తండ్రి ఆత్మ" అని ఉపయోగించగా, అపొస్తలులను ప్రేరేపించే వ్యక్తిని సూచించేటప్పుడు, మార్కు 13:11 "పరిశుద్ధాత్మ" అని ఉపయోగించింది. ("తండ్రి ఆత్మ" అనేది పాతనిబంధనలో కన్పించదు.)

**దేవుని ఆత్మ**

మత్తయి 3:16 "దేవుని ఆత్మ" అని అంటుంది, మార్కు 1:10 మరియు యోహాను 1:32 "ఆత్మ" అని అంటుండగా, యేసు బాప్తిస్మం పొందినప్పుడు ఆయన మీదికి దిగివచ్చిన ఆత్మను గూర్చి మాట్లాడుతూ, లూకా 3:22 "పరిశుద్ధాత్మ" అని తెలిపింది. క్రొత్త నిబంధన లేఖన భాగాల్లో పరిశుద్ధాత్మ "దేవుని ఆత్మ" అని కూడ ఉపయోగింపబడింది (రోమా 8:9, 14; 1 కొరింథీ. 2:11, 14; 3:16; 6:11; 7:40; 12:3; 2 కొరింథీ. 3:3; ఎఫెసీ. 4:30). (పాత నిబంధనలో "దేవుని ఆత్మ" అని మరల మరల ఉపయోగింపబడింది: ఆది. 1:2; నిర్గమ. 31:3; 35:31; సంఖ్యా. 24:2; 1 సమూ. 11:6.)

**సహాయకుడు లేక ఆదరణకర్త**

"ఆదరణకర్త" మరియు "పరిశుద్ధాత్మ" అనే పదాలు యోహాను 14:26లో పర్యాయపదాలుగా ఉపయోగించబడ్డాయి. "అయితే సహాయకుడు" ["ఆదరణకర్త," KJV; "ఆలోచనకర్త," NIV], "పరిశుద్ధాత్మ ... ."

### సత్యస్వరూపియగు ఆత్మ

యోహాను 14:16, 17ల్లో "ఆదరణకర్త," "సత్యస్వరూపియగు ఆత్మ" అనేవి పర్యాయపదాలుగా వినియోగించబడ్డాయి. ఇది యోహాను 15:26లో కూడ సత్యమై యుంది: "తండ్రియొద్దనుండి మీ యొద్దకు నేను పంపబోవు ఆదరణకర్త, [ఉత్తరవాది] అనగా తండ్రియొద్దనుండి బయలుదేరు సత్యస్వరూపియైన **ఆత్మ** వచ్చినప్పుడు ఆయన నన్నుగూర్చి సాక్ష్యమిచ్చును."

### ప్రభువు ఆత్మ

లూకా 4:18లో, "**ప్రభువు** ఆత్మ నామీద ఉన్నది" ... అని ప్రభువైన యేసు చెప్పాడు. ప్రభువు యొక్క ఆత్మను శోధించుటకు అని అపో. 5:9 కూడా ప్రస్తావిస్తుంది (5:3లో "పరిశుద్ధాత్మను" సూచించడమయ్యింది). 2 కొరింథీ. 3:17 చదువు ("ప్రభువు ఆత్మ" అని పాత నిబంధన అనేక మార్లు అంటుంది – ఉదాహరణకు, న్యాయాధి. 6:34; 11:29; 13:25; 14:6).

### యేసు లేక క్రీస్తు ఆత్మ

రోమా 8:9 "క్రీస్తు ఆత్మ" అని అంటే, గలతీ. 4:6 "ఆయన కుమారుని ఆత్మ" అని అంటుంది. ఫిలిప్పీ. 1:19, 1 పేతురు 1:11లను కూడా చదువు. 2 పేతురు 1:20, 21 నుండి 1 పేతురు 1:11తో పోల్చడంవలన, క్రీస్తు ఆత్మ, పరిశుద్ధాత్మ అనేవి ఒక్కటేయని మనం తీర్మానించవచ్చు.

పరిశుద్ధాత్మను గూర్చి చర్చించడంలో, ఆయన వ్యత్యాసమైన పదాలతో సూచింపబడినట్టు గుర్తించడం చాల ప్రాముఖ్యమైయుంటుంది. లేఖనాల్లో పలువిధములైన పదాలు కన్పించినప్పుడు, పరిశుద్ధాత్మయే ఆలోచింపబడుతున్నట్టు ప్రతిసారి మనం రుజువు చేయనవసరం లేదు. సందర్భం వేరే అర్థాన్ని అధికారపూర్వకంగా కోరనట్టయితే, ఆయన పరిశుద్ధాత్మయనే భావాన్ని మనం నిశ్చయంగా కలిగియుండాలి.

---

## పరిశుద్ధాత్ముని దూషించుట

పరిశుద్ధాత్మునికి వ్యతిరేకంగా చేసే పాపాలన్నిటిలో పరిశుద్ధాత్ముని దూషించుట అనేది ఎక్కువ చర్చించినదైయుంది. పరిశుద్ధాత్ముని దూషించుటను గూర్చి యేసు చెప్పినదానిపై నానారకాలైన వివరణలను యిస్తున్నారు. నాలుగు సువార్తలలోని మూడు సువార్తలు ఈ పాపమును గూర్చి ప్రస్తావిస్తున్నాయి (మత్తయి 12:31, 32; మార్కు 3:28, 29; లూకా 12:9, 10).

పరిశుద్ధాత్ముని దూషించుటను గూర్చి యితర బైబిలు వాక్య భాగాలు బోధిస్తున్నాయని తప్పుగా కొందరు తెలుపుతున్నారు. ఉదాహరణకు, హెబ్రీ. 6:4–6 మరియు 1 యోహాను 5:16 ఒక నిర్దిష్టమైన పాపమును గూర్చో లేక రచయితలు ఆ పాపమును గూర్చి

పేర్కొనుటయూ లేదు. అయితే, ఈ వచనాలలో సామాన్యమైన పాపమును గూర్చి సూచింపబడింది. కాని, మరోవైపు, యేసు పరిశుద్ధాత్మనికి వ్యతిరేకంగా మాట్లాడు దూషణను గూర్చిన నిర్దిష్టమైన పాపమును ప్రస్తావించారు.

మత్తయి సువార్తలోని వాక్య భాగము యొక్క సందర్భమును బట్టి యితరుల యెదుట పరిశుద్ధాత్మని విఖ్యాతికి హాని కలిగించే తలంపును పరిశుద్ధాత్మని దూషించుటయని సూచిస్తుంది. పరిసయ్యులు యేసుని కార్యములు సాతాను యొక్క శక్తివలన చేయబడ్డవని ఇతరులను నమ్మించడానికి యేసుకు విరోధముగా మాట్లాడిరి (మత్తయి 12:24). వారు యేసుని, ఆయన బోధలను తిరస్కరించుట కంటె అదిగమించారు; వారు దూషించారు. ఈలాగు యేసుకు వ్యతిరేకముగా మాట్లాడడాన్ని క్షమించవచ్చును అని యేసు సూచించారు (మత్తయి 12:32).

పౌలు – సౌలుగా ఎరుగబడినప్పుడు – దేవదూషణ చేయునంతగా యేసునకు వ్యతిరేకముగా క్రైస్తవులను హింసించుచుండెను (1 తిమోతి 1:13–16). యేసునకు విరోధముగా దూషించి, క్షమింపబడినవారిలో ఇతడు ఉదాహరణముగా ఉన్నాడు.

దీనికి భిన్నంగా, దురుద్దేశముతో పరిశుద్ధాత్మనికి వ్యతిరేకంగా మాట్లాడినవారు క్షమింపబడరని యేసు బోధించారు. దీన్ని చేయువారు క్రైస్తవ్యములోని ప్రాథమికమైనవాటి కంటె ఎక్కువైనవాటిని గ్రహించాలి. పరిశుద్ధాత్మని యొక్క పని, మరియు తదితర సూక్ష్మమైన అంశాలను గ్రహించాలి. ఆయనకు వ్యతిరేకముగా మాట్లాడడం పరిశుద్ధాత్మని కార్యమును తిరస్కరించటం మాత్రమే గాకుండ, పరిశుద్ధాత్మని పనులను సాతాను యొక్క పనులుగా ఆపాదించి యితరులను పరిశుద్ధాత్మనినుండి దూరపరుస్తున్నారు. ఈ ప్రయత్నాలవలన తమ్మును తామే శాపగ్రస్తులనుగా చేసుకొంటూ, తమ బోధను అంగీకరించినవారిని నశించేలా చేస్తున్నారు.

దూషించడమనేది పరిశుద్ధాత్మని మాటలను తిరస్కరించడం కంటె అధికమైనది. పరిశుద్ధాత్మని పనులపై అవిశ్వాసమును కలిగిస్తూ ఆయన పనులు దుష్టునినుండి కలిగినవని ఇతరులను పురికొల్పడమౌతుంది. ఎవడును దీనిని తేలికగా చేయలేడు. యిలా ప్రవర్తించువారికి హృదయములో ద్వేషపూరితమైన ఉద్దేశం ఉండియుండాలి. ఈ యుగమందైనను, రాబోవు యుగమందైనను ఇలాంటి ప్రవర్తనకు తనను తాను అప్పగించు కొన్నవాడు క్షమింపబడనేరడు; అతడు నిత్య పాపమును చేస్తున్నాడు (మార్కు 3:29).

పరిశుద్ధాత్మని దూషించుటలో మూడు అపరాధములు చేర్చబడి ఉన్నాయి: (1) పరిశుద్ధాత్మనిపై ద్వేషపూరితమైన భావం కలిగియుండుట, (2) అతనిని గూర్చి యితరులతో చెడుగా మాట్లాడుట, (3) యితరులు పరిశుద్ధాత్మని పనిని తిరస్కరించుటకును, అతని పనులు అపవాదివలన జరుగుతున్నాయని నమ్మేలా యితరులపై ప్రాబల్యం ఉపయోగించుటయు.

## పరిశుద్ధాత్మ మరియు ప్రభువైన యేసు

పరిశుద్ధాత్మ పని క్రీస్తును కప్పిపుచ్చనుద్దేశించింది కాదు; ఆయనను మహిమపరచి ఘనపరచేదై యుంటుంది. ఇందు విషయమై ప్రభువు యిలా అన్నారు: "అయితే ఆయన, అనగా సత్యస్వరూపియైన **ఆత్మ** వచ్చినప్పుడు మిమ్మును సర్వసత్యములోనికి నడిపించును; ఆయన తనంతట తానే యేమియు బోధింపక, వేటిని వినునో వాటిని బోధించి సంభవింపబోవు సంగతులను మీకు తెలియజేయును. ఆయన నా వాటిలోనివి తీసికొని మీకు తెలియజేయును గనుక నన్ను మహిమపరచును" (యోహాను 16:13, 14). ఆయనకు బాప్తిస్మమిచ్చిన యోహాను తనవైపు చూపుకొనక, ప్రభువువైపు జనులను ఎలా మళ్లించాడో (యోహాను 1:26, 27), అలాగే ఆత్మయు ప్రభువును హెచ్చించును గనుక, ప్రభువే సమస్తమైన ఘనత, మహిమ, ప్రభావము పొందుతాడు (ప్రకటన 4:11).

## యేసు ఏకరీతిగానున్నారు

"యేసుక్రీస్తు నిన్న, నేడు, ఒక్కటే రీతిగా ఉన్నాడు; అవును యుగయుగములకును ఒక్కటే రీతిగా ఉండును" (హెబ్రీ. 13:8) అనే ప్రతిపాదనను బట్టి నేడుకూడ సూచకక్రియలు అద్భుతాలు కొనసాగుతాయని కొన్ని మతసంబంధమైన గుంపులు ఎదురు చూస్తున్నాయి. ఈ తీర్మానము సరియైనది కానేరదు. ఎందుకంటె ఈ లేఖన భాగము అద్భుతాలను చర్చించలేదు. కాని తన ప్రజలపట్ల దేవుని నిరంతర శ్రద్ధను యిది చూపుతుంది (హెబ్రీ. 13:5, 6). క్రీస్తు ప్రభువు యొక్క ఉనికి లేక ఆయన కార్యక్రమములు ఎల్లవేళల్లో ఒక్కటే రూపంగా ఉన్నాయి. ప్రతి విషయంలోను ఉండబోతాయని అనేది కూడ ఈ లేఖన భాగము యొక్క సందేశం కాదు. ఉదాహరణకు, ఆయన భూలోకానికి సశరీరుడుగా రాకముందు ఆత్మ రూపంలో ఉన్నారు (యోహాను 1:14; హెబ్రీ. 10:5సి), తండ్రి యొద్దకు ఆయన తిరిగి ఆరోహణమైనప్పుడు తన మునుపున్న స్థితికి వెళ్లారు (యోహాను 17:5). వ్యక్తిగా ఆయన నేడు భూమిమీద లేరు సరిగదా, ఆయన దేవుని కుమారుడని మనము నమ్మునట్లు సూచక క్రియలు జరిగించడానికి ఆయన తిరిగివచ్చేది లేదు. ఆయన భూమిమీద ఉన్నప్పుడు జరిగించిన సూచకక్రియలు, అద్భుతాలు మనము నమ్మునట్లు దాఖలు చేయబడ్డాయి (యోహాను 20:30, 31). అలాగే, సిలువలో ఆయన విమోచనా మరణము కొనసాగే కార్యమైయుండదు. అది తిరిగి జరుగకుండ ఒక్కసారే నెరవేర్చబడిన కార్యమైయుంది (హెబ్రీ. 1:3; 7:27; 9:12, 24–26; 10:12–14).